

ఆ విషాదం.. మరువలేనిది

జామి మండలం అలమండ సమీపంలో రైలు ప్రమాదం(ఫైల్)



చిరంజీవి (ఫైల్)

2023 అక్టోబరు 29 రాత్రి 7 గంటల సమయం..
అంతవరకూ ప్రశాంతంగా ఉన్న విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి, జామి మండలం అలమండ ప్రాంతాల ప్రజలు పిడుగుపాటులాంటి భారీ శబ్దాన్ని విన్నారు. కొన్ని క్షణాల పాటు భయంతో వణికిపోయారు. కాస్త తేరుకున్నాక ఏమైందో తెలుసుకుందామని రైల్వేట్రాక్ వైపు పరుగులు తీశారు. అక్కడకు వెళ్లాక చెల్లాచెదురైన మృతదేహాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు.. ధ్వంసమైన రైలు బోగీలతో భయానక వాతావరణాన్ని చూసి చలించిపోయారు.
ఈ దుర్ఘటన జరిగి నేటికి ఏడాది పూర్తవుతోంది.
ఆ ఘోరాన్ని చూసిన వారు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. బాధితులుగా మిగిలిన వారి కష్టాలు ఇంకా తీరలేదు. భర్తను కోల్పోయిన భార్య, పిల్లలు, కుమారుడు దూరమైన బాధలో తల్లిదండ్రులు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.



సుగుణమ్మ, లక్ష్మీ(ఫైల్)

- ఘోర రైలు ప్రమాదం జరిగి నేటికి ఏడాది
- 14 కుటుంబాల్లో నింపిన చీకట్లు
- కంటకాపల్లి- అలమండ మిడ్ లైన్‌లో ప్రమాదం
- పలాస ప్యాసింజర్‌ను వెనక నుంచి ఢీకొట్టిన రాయగడ రైలు
- జిల్లా వాసులు ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు

శృంగవరపుకోట/ ఎచ్చెర్ల/ జి.సిగడాం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి, జామి మండలం అలమండ ప్రాంతాల ప్రజలు ఇప్పటికీ మరువలేని రైలు ప్రమాదం జరిగి నేటికి ఏడాదవుతోంది. పలాస పాసింజర్ రైలును రాయగడ పాసింజర్ రైలు బలంగా ఢీకొనడంతో ఆ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో జిల్లాకు సంబంధించి ముగ్గురు మృతి చెందారు. పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు. అలాగే విజయనగరం జిల్లా గరివిడికి చెందిన తాపీమేస్త్రీ మజ్జి రాము, చీపురుపల్లి మండలం రెడ్డిపేటకు చెందిన తాపీమేస్త్రీ రెడ్డి సీతంనాయుడు, విజయనగరం తోటపాలెనికి చెందిన చల్లా సతీష్, గరివిడి మండలం కాపుశంభావం గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ కరణం అప్పలనాయుడు.. ఇలా 14మంది మృతి చెందారు. మరో 60 మంది క్షతగాత్రులుగా మారడంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయి. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.10లక్షలు అందించినా కుటుంబ సభ్యుడ్ని కోల్పోయిన బాధ నుంచి ఇంకా బయటపడలేదు.

ఏమి జరిగిందంటే..

- ఆ రోజు రాత్రి 7గంటల సమయంలో కొత్తవలస మండలం కంటకాపల్లి, జామి (మిగతా 6వ పేజీలో..)


కొడుకు దూరమయ్యాడనే వేదన..

గతేడాది అక్టోబరు 29న జరిగిన రైలు ప్రమాదంలో ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన సువ్వారి చిరంజీవి మృతిచెందారు. ఇంజనీరింగ్ చదివిన చిరంజీవి రైల్వేలో లోకో పైలట్‌గా పనిచేస్తూ... ప్రమాదం జరిగిన రోజున అదే రైలులో విధులు నిర్వర్తించారు. అప్పటికి 40 రోజుల ముందు వరకు విశాఖపట్నంలోని డీఆర్ఎం కార్యాలయంలోనే ఈయన పనిచేసేవారు. ప్రమాదంలో చిరంజీవి మృతి చెందడంతో.. అధికారులు ఈయన భార్య జ్యోత్స్నకు రైల్వేలో ఉద్యోగం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె మూడేళ్ల కుమారుడు భవదీప్‌తో కలిసి విశాఖలో నివసిస్తోంది. చిరంజీవి తల్లిదండ్రులు సువ్వారి సన్యాసిరావు, అమ్మాజమ్మ స్వగ్రామమైన కుశాలపురంలోనే నివాసం ఉంటున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు దూరమై ఏడాది అవుతున్నా.. ఇప్పటికీ ఆ చేదు నిజాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు.

పరిహారం అందించినా..

జి.సిగడాం మండలం ఎస్‌పీఆర్ పురానికి చెందిన గడిజాల లక్ష్మి(40), మెట్టవలసకు చెందిన టంకాల సుగుణమ్మ (78) కూడా గతేడాది రైలు ప్రమాదంలో మృతి చెందారు. విశాఖపట్నంలో శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా.. జరిగిన రైలు ప్రమాంలో గుడిజాల లక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తీవ్రగాయాలు పాలైన సుగుణమ్మ చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందింది.

- లక్ష్మీ మృతి భర్త రామారావు, ఇద్దరు కుమారులు విషాదంలో మునిగిపోయారు. రామారావు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుమారులు సాయి డిగ్రీ, తరుణ్ ఐటీఐ చదువుతున్నారు. లక్ష్మీ మృతి చెందిన తర్వాత ప్రభుత్వ పరంగా రూ.20లక్షల ఆర్థిక సహాయం అందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ, ఆమె లేని లోటు తమకు తీరనదని కన్నీటి పర్యంతమయ్యారు.
- టంకాల సుగుణమ్మ మృతి చెందటంతో కుమారుడు అదాం పాలకొండలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుగుణమ్మ మృతితో పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ రూ.20 లక్షలు అందించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. బీమా కింద రూ.10లక్షలకు గానూ తక్షణం రూ.2లక్షలు ఇచ్చారని చెప్పారు. మిగిలిన డబ్బులు నెలకు రూ.10వేలు చొప్పున ఆరేళ్లలో అందజేయనున్నారని వివరించారు.
- ఇదే ఘటనలో జి.సిగడాం గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మకు రెండు కాళ్లు విరిగిపోయాయి. నాలుగేళ్ల మోక్ష, పన్నెండేళ్ల మజ్జి అమృత, సూర్యకాంతం, రమణకు తీవ్ర గాయాలయ్యాయి. మెట్టవలసకు గ్రామానికి చెందిన డెంకా అప్పనమ్మకు కూడా గాయాలయ్యాయి. వారంతా ప్రస్తుతం కోలుకున్నారు. ఆనాటి దుర్ఘటన.. మాత్రం ఇంకా తమ కళ్లముందే మెదులుతోందని పేర్కొంటున్నారు.



ముఖ్యమంత్రి పర్యటనకు స్థల పరిశీలన

కంచిలి/ సోంపేట/ ఇచ్ఛాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నవంబరు 1న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సభా వేదిక, హెలీప్యాడ్ కోసం అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియోజకవర్గంలో పర్యటించారు. సోంపేట మండలం కొర్లాం పంచాయతీ గొనకపాడు, బారువ రైల్వే గేట్ సమీపంలోని స్థలాలను పరిశీలించారు. కంచిలి మండలం పద్మతుల గ్రామ సమీపంలో స్థలాన్ని కూడా పరిశీలన చేశారు. వీటితోపాటు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం వద్ద స్థలాన్ని పరిశీలించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం తహసీల్దార్లు అప్పలస్వామి, రమేష్‌కుమార్, వెంకటరావు, సీఐలు బి.మంగరాజు, చిన్నంనాయిడు, ఎస్ఐలు చంద్రశేఖర్, జి.రాజేష్, ఈ.శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.



కంచిలి పద్మతుల వద్ద హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు



వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో వేంకటేశ్వరరావు

డీఆర్వోగా వేంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.వేంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఆయన టెక్కలి ఆర్డీవోగా పనిచేసి.. బదిలీపై రంపచోడవరంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ కలెక్టర్‌గా వ్యవహరించారు. డీసీగా పదోన్నతి తర్వాత ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిగా, ఆర్ఆర్‌సీ స్పెషల్ డీసీగా కూడా జిల్లాలో పని చేశారు. ప్రస్తుతం డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 142 వినతులను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రతీ అర్జీని సంబంధిత ప్రధాన అధికారి వ్యక్తిగతంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, డ్వామా పీడీ సుధాకర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఉద్యానవన అధికారి వరప్రసాద్, డీఆర్డీఏ, విద్యాశాఖ విద్యుత్, ల్యాండ్ సర్వే పోలీసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రా'నైట్' రవాణా

- పరిమితికి మించి బ్లాకుల తరలింపు
- తూతూమంత్రంగా తనిఖీలు


టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దొరికితే దొంగ.. లేదంటే దొర అన్న చందంగా గ్రానైట్ క్వారీ యాజమానులు వ్యవహరిస్తున్నారు. రాత్రివేళ ఓవర్‌లోడ్ గ్రానైట్ బ్లాకులు అక్రమ రవాణా చేస్తున్నారు. జిల్లాలో వందకుపైగా కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. పలువురు గ్రానైట్ బ్లాకుల యజమానులు కొద్ది గంటల వ్యవధిలోనే వాటిని ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. నిబంధనల మేరకు 16 టైర్ల టారస్ వాహనం.. దాని బరువుతో కలిపి 45 టన్నుల వరకు గ్రానైట్ బ్లాకులు రవాణా చేయాలి. 18టైర్ల ట్రైలర్ వాహనం 50 టన్నులు, 22 టైర్ల ట్రైలర్ వాహనం 55 టన్నుల వరకూ బ్లాకులు రవాణా చేయవచ్చు. కాగా.. పరిమితికి మించిన బరువుతో రాత్రివేళ గ్రానైట్ బ్లాకులు తరలిస్తున్నారు. సుమారు 20 టన్నులు అదనంగా రవాణా చేస్తున్నారు. అధిక బరువుతో వెళ్లే వాహనాలు తనిఖీ అధికారులకు పట్టుబడితే.. డ్రైవర్‌కు రూ.20వేలు, టన్నుకు రూ.2వేలు చొప్పున అపరాధ రుసుం విధిస్తారు. కాగా.. ఇంధన శకట, విజిలెన్స్, పోలీసు అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ అధికారులు తనిఖీల్లో వాహనాలు పట్టుకున్నా.. క్షణాల్లో పెద్దల నుంచి ఫోన్లు రావడంతో వాటిని విడిచిపెట్టేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాగే అధిక బరువుతో వాహనాల రవాణా వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు సైతం ఛిద్రమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిమితికి మించి గ్రానైట్ బ్లాకుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంవీఐ సంజీవరావు వద్ద ప్రస్తావించగా అధిక లోడ్లుతో వెళ్లే వాహనాలు దొరికితే కేసులు నమోదు చేస్తూ అపరాధ రుసుంలు విధిస్తున్నామని తెలిపారు.



టెక్కలిలో ఒకే వాహనంపై ఐదు బ్లాకుల రవాణా

ఈ పండగ ప్రత్యేకం! 6లో

- నేడు ధన త్రయోదశి



అమ్మో.. బ్రెయిన్ స్ట్రోక్!

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- అవగాహన లేక.. గుర్తించలేక.. ఇబ్బందులు

6లో

ఆయుర్వేదం.. దివ్యౌషధం

- దీర్ఘకాలిక వ్యాధులకు పూర్తి స్థాయి చికిత్స

న్యూస్ బాక్స్

కిడ్నీ వ్యాధితో ప్రాణాలు పోతున్నాయ్

- 'మీ-కోసం'లో పిల్లలవలస గ్రామస్థుల ఆవేదన
- తాగునీటి సదుపాయం కల్పించాలని వినతి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'మా గ్రామంలో తాగే నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంది. దీంతో కిడ్నీవ్యాధితో బాధపడుతూ చిన్న వయసులోనే చాలామంది మరణిస్తున్నారు. పదేళ్లుగా ఇదే పరిస్థితి. అధికారులు, నాయకులకు ఎన్ని విన్నపాలు చేసినా పట్టించుకోవడం లేదు' అని పొందూరు మండలం పిల్లలవలస గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో తమ ఆవేదనను మరోసారి వెల్లడించారు. 'గ్రామంలో 350 కుటుంబాలు నివసిస్తున్నాం. ఇప్పటికే పదిమందికిపైగా కిడ్నీ వ్యాధి బారిన పడి మృతి చెందారు. అందులో అధిక శాతం 50ఏళ్ల లోపు వారు.. యువకులు కూడా ఉన్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండడం ఈ పరిస్థితి తలెత్తింది. ఊరిలో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేయించాం. తాగడానికి హానికరంగా ఉన్నాయని తేలింది. తాగునీటి కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి. వైద్యశిబిరాలు నిర్వహించి.. బాధితులను ఆదుకోవాలి' అని గ్రామస్థులు కోరారు. గ్రామంలో ఆక్రమణకు గురైన చెరువులను పునరుద్ధరిస్తే.. నీటి స్టోరేజీ శాతం పెరిగి కొంత తీవ్రత తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వినతిపత్రం అందజేశారు.



జడ్పీ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న పిల్లలవలస గ్రామస్థులు



కొర్లాంలో భూములను చూపుతున్న రైతులు

రికార్డుల్లో పేర్లు లేవు

వంశపారపర్యంగా వచ్చిన భూములను ఆ రైతులు కొన్ని దశాబ్దాలుగా సాగు చేస్తున్నారు. ఆర్థికపరమైన అవసరాల సమయంలో.. ఆ భూముల క్రయవిక్రయాలు సాగించేవారు. ఆ భూమి పత్రాల ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు సైతం పొందేవారు. కాగా.. 'వైఎస్సార్ జగనన్న భూ రక్ష' పేరిట గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేతో.. వారికి వింత పరిస్థితి ఎదురైంది. దశాబ్దాలుగా వారు సాగు చేస్తున్న భూములు.. రికార్డుల్లో మాత్రం వారి పేరు కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారంలో వైసీపీ పెద్దలు, రెవెన్యూ అధికారుల హస్తం ఉందని ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- కొర్లాం రైతులను నిండా ముంచిన రీసర్వే
- వంశపారపర్యంగా సాగు భూములవి
- సర్వేనెంబర్లు బ్లాక్ చేసిన అధికారులు
- 1బీ, అడంగల్ రాక తీవ్ర ఇబ్బందులు
- అప్పటి వైసీపీ సర్కారు పాపం ఇది
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

సోంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం కొర్లాం రెవెన్యూ పరిధిలో రైతులకు.. భూముల రీ సర్వే రూపంలో షాక్ తగిలింది. వంశపారపర్యంగా సక్రమించిన భూములు.. మరొకరి పేరున ఉండడంతో బాధిత రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొర్లాం రెవెన్యూ పరిధిలో 800 ఎకరాలు ఉన్నాయి. సర్వేనెంబరు 50 నుంచి 110వరకు గల కొర్లాం, బారువ, లక్కవరం, లక్ష్మీపురం, కుమ్మరిపాడు తదితర గ్రామాలకు చెందిన సుమారు 160 మంది రైతులకు సంబంధించి 250 ఎకరాల భూమి ఉంది. వంశపార పర్యంగా వీరికి ఈ భూములు సంక్రమించినట్లు 1బీ, అడంగల్, లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయి. వీటితో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాలు సైతం జరుగుతున్నాయి. వీటిపై ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌యోజన, రైతు భరోసా నిధులు కూడా వీరి ఖాతాల్లో జమవుతున్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. అధికారులు 'వైఎస్సార్ జగనన్న భూ రక్ష' పేరిట భూముల (మిగతా 6వ పేజీలో..)

అమ్మో.. బ్రెయిన్ స్ట్రోక్

● జిల్లాలో పెరుగుతున్న బాధితులు ● అవగాహన లేక..గుర్తించలేక.. ● అన్ని వయసుల వారిలోనూ వ్యాప్తి

● మారిన జీవన శైలితోనే ● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు

● నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే



● ఈ ఏడాది ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తూ సోంపేటకు చెందిన మల్లారెడ్డి కిరణ్‌చంద్ అనే విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. పరీక్ష కేంద్రంలో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు శతవిధాలా ప్రయత్నించినా బ్రెయిన్ డెడ్ అయ్యింది. వెంటనే ఆ బాలుడి అవయవాలను దానం చేసి... మరో ఇద్దరికి పునర్జన్మ ఇచ్చారు కుటుంబ సభ్యులు.

● సోంపేటకు చెందిన జగదీష్ అనే వ్యక్తి ఈ నెల 22న అస్వస్థతకు గురయ్యాడు. ఇంట్లో స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా... బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను దానం చేసేందుకు సిద్ధపడ్డారు. కిడ్నీలు, ఊపిరితిత్తులను వైద్యులు సేకరించి.. మరో ముగ్గురికి అమర్చారు.

● ఎల్ఎన్ పేట మండలం గార్లపాడు గ్రామానికి చెందిన నార్ల అచ్యుతరావు రెండేళ్ల కిందట బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ఆస్పత్రికి తరలించే సరికే కోమాలోకి వెళ్లిపోయారు. బ్రెయిన్ డెడ్ కావడంతో వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు.



రణస్థలం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా 50 ఏళ్లు పైబడిన వారిలో ఈ రుగ్మత కనిపిస్తుండడం గమనార్హం. మారిన మనిషి జీవన శైలి, కుటుంబ స్థితిగతులు, పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, అలవాట్లు ఈ రుగ్మతకు ప్రధాన కారణం. ఉన్నట్టుండి కంటి చూపు కోల్పోవడం, అదుపు తప్పి పడిపోవడం, అనూహ్యంగా ప్రవర్తనలో మార్పు రావడం వంటి లక్షణాలతో బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. శరీరంలో ఒక చేయి బలహీనం కావడం, అడుగు తీసి అడుగు వేసేందుకు కాళ్లు సహకరించకపోవడం లాంటివి కూడా స్ట్రోక్ లక్షణాలే. ఒక్కసారి బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడితే శాశ్వత వైకల్యానికి గురికాక తప్పదు. పక్షవాతంతో మంచానికే పరిమితం కావాల్సి ఉంటుంది. అత్యంత ప్రమాదకరమైనా.. దీనిపై ప్రజల్లో అవగాహన తక్కువే. అందుకే ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్నారు.

మారిన జీవన శైలితోనే...

మారుతున్న జీవన శైలి, జన్యుపరమైన కారణాలతో చిన్న వయసులోనే బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు 60-70 ఏళ్ల మధ్య ఉన్న వారిలో ఈ రుగ్మత కనిపించేది. కానీ ఇప్పుడు 40 నుంచి 50 ఏళ్ల మధ్య వారిలో సైతం బయట పడుతుండడం గమనార్హం. రక్తనాళాల్లో ఏర్పడే వైఫల్యం కారణంగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతారు. రక్తం గడ్డకట్టడం ద్వారా రక్తనాళాలు పాక్షికంగా మూసుకుపోతాయి. మెదడుకు రక్తం సరఫరా కాకపోవడంతో స్ట్రోక్ వస్తుంది. దీనికి హైబీపీ, సుగర్, పొగ తాగడం కారణాలని నిపుణులు చెబుతున్నారు. మెదడులో రక్తసరఫరా ఆగిన చోట స్ట్రోక్ లక్షణాలు బయట పడతాయి. మెదడులోని కాళ్లు, చేతులను నియంత్రించే భాగాలకు రక్త సరఫరా ఆగిపోతే చచ్చుబడిపోతాయి. ముఖం, నోరు, కన్ను, ఒక్కోసారి శరీరానికి ఇరువైపులా ఉన్న భాగాలు సైతం ప్రభావితం కావచ్చు. మాట పడిపోవడం, స్థిమితంగా లేకపోవడం, తిమ్మిరి, చూపు, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే బ్రెయిన్ స్ట్రోక్‌గా అనుమానించాలి. వెంటనే వైద్య చికిత్సలు పొందాలి. ప్రధానంగా ఉప్పు వాడకపోవడం చాలా మంచిది. రోజుకు 3 నుంచి 4 గ్రాములకు మించకుండా వినియోగించడం ఉత్తమం.

వాటికి దూరంగా ఉండాలి

పొగ తాగడం మానుకోవాలి. పొగ తాగడంతోనే ఈ వ్యాధి ఎక్కువగా వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు ఒత్తిడిని తగ్గించుకునేందుకు సిగరెట్ వంటివి తాగుతుంటారు. ఈ క్రమంలో పొగ తాగి చేజేతులా అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటారు. అతిగా మద్యం తీసుకోవడం సైతం ముప్పే. ఫైబర్, ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండేవి మేలు చేస్తాయి. రోజులో కనీసం 45 నిమిషాలు, వారానికి ఐదు రోజులు వేగవంతంగా నడవాలి. సైక్లింగ్, ఈత, షటిల్ వంటివి ఆడడం చాలా ఉత్తమం. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు 400 గ్రాములు తీసుకోవడం చాలా మంచిది. కనీసం రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీటిని తాగితే శరీరంలోని మలినాలు బయటకు పోతాయి. ఆరోగ్యానికి రక్షణ కవచంలా నీరు పని చేస్తుంది.


చాలా జాగ్రత్తగా ఉండాలి



మెదడుకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాలు పాక్షికంగా లేదా పూర్తిగా పూడుకుపోవడంతోనే బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. తద్వారా పక్షవాతానికి సైతం దారి తీస్తుంది. దీనినే ఇస్కీమిక్ స్ట్రోక్ అని పిలుస్తారు. అదే రక్తనాళాలు చిట్లిపోయి మెదడులో రక్తం లీకయితే హేమరేజిక్ స్ట్రోక్‌గా పిలుస్తారు. వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానానికి దూరంగా ఉండడం మంచిది. సుగర్, హైబీపీని అదుపులో ఉంచుకోవాలి. లేదంటే ఇబ్బందికరమే. మనసును నియంత్రణలో ఉంచుకోవడం... ఒత్తిడికి దూరంగా ఉండడం వంటివి చేయాలి. వ్యాయామం, యోగా, మంచి ఆహారం తీసుకోవడం ఉత్తమం.

- డాక్టర్ కల్యాణబాబు, ఎండీ, శ్రీకాకుళం

పొట్లకాయ కాదు..



రెండున్నర అడుగులు పెరిగిన వంకాయ

నరసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూసి... పొట్లకాయ అని పొరపడుతున్నారా? సరిగా పరిశీలించండి... అవును... మీరు ఊహించినది నిజమే. అది పొట్లకాయ కాదు. అక్షరాలా వంకాయే. సాధారణ రకం వంకాయల్లా కాకుండా.. సన్నగా... పొడవుగా దాదాపు రెండున్నర అడుగులకు పైగా ఉంటోంది. సారవకోట మండలం నవరడ్డపనస గ్రామానికి చెందిన చీడి విశ్వప్రసాద్ తన పెరటి తోటలో ఈ వంగ మొక్కను పెంచుతున్నారు. ఇవి కేరళ జాతికి చెందిన ఇల్లీకుంబన్ రకానికి చెందినవని చెబుతున్నారు. ఈ రకానికి చెందిన వంకాయలు పండించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. వీటిని చుట్టు పక్కల వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. వివిధ రకాల పండ్ల చెట్లు, బాతులు, వివిధ జాతులకు చెందిన పెరటి కోళ్లు పెంచడం విశ్వప్రసాద్‌కు అలవాటు. దేశంలోని వివిధ ప్రాంతాలలో లభించే కూరగాయలు, పండ్ల చెట్లు నాటుతుంటానని చెప్పారు. విశ్వప్రసాద్ సారవకోట జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు.

ఆయుర్వేదం.. దివ్యౌషధం

● దీర్ఘకాలిక వ్యాధులకు పూర్తి స్థాయి చికిత్స

● బీపీ, షుగర్ వంటి వ్యాధులకూ వైద్యం





అరసవల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం...వేల సంవత్సరాల క్రితమే భారత దేశం ఈ ప్రపంచానికి అందించిన గొప్ప వరం. మహర్షి ధన్వంతరి జయంతి రోజున (మంగళవారం) దేశంలో జాతీయ ఆరోగ్య దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యం విశిష్టతను తెలుసుకుందాం.

శస్త్ర చికిత్సల అవసరం లేకుండా..

ఆధునిక వైద్య విధాన చికిత్సలలో దీర్ఘకాలిక వ్యాధుల పూర్తి నివారణకు చికిత్సలు అందుబాటులో లేవు. కీళ్లవాతం, కొన్ని రకాల చర్మవ్యాధులు, జీర్ణకోశ సంబంధ వ్యాధులు, కాలేయ వ్యాధులు, కంటి చికిత్సలు, నరాల వ్యాధులు, కిడ్నీ సమస్యలు, స్త్రీ సంబంధిత వ్యాధులకు అల్లోపతి వైద్యులు శస్త్ర చికిత్సలను ఆశ్రయిస్తున్నారు. ఆయుర్వేదంలో ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు పూర్తి స్థాయిలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. పైల్స్, ఫిస్టులా తదితర మొండి వ్యాధులకు శస్త్ర చికిత్సల అవసరం లేకుండా ఆయుర్వేదంతో నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

చికిత్సలు అందుబాటులో..

జనరల్ మెడిసిన్, చెవి, ముక్కు, గొంతు, నేత్రాలు, ఇన్‌ఫెర్టిలిటీ తదితర సమస్యలకు ఆయుర్వేద వైద్య విధానంలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. శాలక్యతంత్రం, వాజీకరణ చికిత్సా పద్ధతుల ద్వారా వీటిని శస్త్ర చికిత్సల అవసరం లేకుండా నయం చేస్తారు. చిన్నపిల్లలు, మానసిక వ్యాధులకు, ఆహార నియమాలకు సంబంధించి పూర్తి చికిత్సా విధానాలు ఆయుర్వేదంలో అందుబాటులో ఉన్నాయి.

ఇతర సమస్యలు తలెత్తకుండా..

రక్తపోటు(బీపీ), మధుమేహం (షుగర్ వ్యాధి) వంటి దీర్ఘకాల వ్యాధులకు కూడా ఆయుర్వేద వైద్య విధానంలో ఎన్నో మందులు అందుబాటులోకి వచ్చాయి. అల్లోపతి మందులతో చాలా సైడ్ ఎఫెక్ట్ ఉంటాయి. అందులోనూ దీర్ఘకాలిక మందుల వాడకంతో కొత్త అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఆయుర్వేదంలో అటువంటి ఇబ్బందులకు తావే లేదని వైద్యులు చెబుతున్నారు.

ఉచితంగా...

రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 120 ఆయుష్ వైద్యశాలలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, వెల్‌నెస్ సెంటర్లుగా ఉన్నతీకరించారు. ఈ సెంటర్ల ఆధ్వర్యంలో నిత్యం రోగులకు వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్సలను పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. జిల్లాలో శ్రీకాకుళం, సింగుపురం, కోటబొమ్మాళి, పూండి, కె.నౌపడ, సంతవురిటి, తెంబూరులో ఆయుష్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చికిత్సతో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తారు. యోగా, ఔషధ మొక్కల పెంపకం, వాటి వినియోగంపై అవగాహన కల్పిస్తారు.

అపోహలు వద్దు



ఆయుర్వేద చికిత్సలపై ప్రజలు అపోహలను విడనాడాలి. జిల్లాలోని అన్ని ఆయుష్ వైద్య కేంద్రాలకు జాతీయ హెల్త్ బోర్డు గుర్తింపు ఉంది. ఈ సెంటర్లలో సామాన్య వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లవాతం, బీపీ, డయాబెటిస్, చర్మవ్యాధులకు పూర్తి చికిత్సను అందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం మందులను కూడా పూర్తి స్థాయిలో సరఫరా చేస్తోంది. ప్రజలు ఆయుర్వేద వైద్యసేవలను వినియోగించుకోవాలి.

- డాక్టర్ పి.జగదీష్, సీనియర్ ఆయుష్ వైద్యాధికారి, శ్రీకాకుళం

ఏడేళ్ల బాధ నుంచి ఉపశమనం



నేను తీవ్రమైన పార్శ్వనొప్పితో బాధ పడ్డాను. సుమారు ఏడేళ్ల పాటు వైద్యుల వద్దకు చికిత్స కోసం తిరిగాను. వేలాది రూపాయల ఖర్చు తప్ప ఫలితం లేకుండా పోయింది. శ్రీకాకుళంలో గల ఆయుష్ వైద్య కేంద్రంలో చికిత్స అనంతరం ఉపశమనం లభించింది.

- ఎస్.చిన్నమ్మడు, ఆమదాలవలస

తలనొప్పి తగ్గింది



నేను తీవ్రమైన తలనొప్పి, మెడనొప్పితో బాధపడ్డాను. అందుబాటులో ఉన్న స్పెషలిస్టుల దగ్గర వైద్యం చేయించుకున్నాను. కానీ తగ్గలేదు. నగరంలోని ఆయుష్ వైద్య కేంద్రంలో మందులతో పూర్తిగా ఉపశమనం లభించింది. అక్కడే యోగా నేర్చుకున్నాను. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను.

- ఎస్.ఈశ్వరరావు, శ్రీకాకుళం

కీళ్ల నొప్పులు తగ్గాయి



నేను చాలా ఏళ్లుగా కీళ్ల నొప్పులు, తిమ్మిర్లతో బాధ పడుతున్నాను. వైద్యుల చుట్టూ తిరిగి వారు ఇచ్చిన మందులు వాడినా తాత్కాలిక ఉపశమనమే గానీ నొప్పి తగ్గలేదు. నగరంలోని ఆయుష్ కేంద్రంలో చికిత్స చేసుకున్నాక... నడవగలుగుతున్నాను.

- కొమ్మనాపల్లి రామారావు, రిటైర్డు హెడ్ కానిస్టేబుల్, నరసన్నపేట

ఈ పండగ.. ప్రత్యేకం

● నేడు ధన త్రయోదశి

● కుబేరుడు, లక్ష్మీదేవికి పూజలు

● ఆరోగ్యం కోసం ధన్వంతరికి ప్రార్థనలు

● మార్వాడీలకు ఎంతో ముఖ్యం



ఓ మార్వాడీ ఇంట్లో పూజా మందిరం

నరసన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధన త్రయోదశి.. దీపావళికి రెండు రోజుల ముందు వచ్చే పండగ. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ పండగ జరుపుకుంటారు. ధన త్రయోదశిని మరాఠీలో ధన్ తేరాస్ అని అంటారు. మార్వాడీలు ఈ పండగకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, టెక్కలి, ఆమదాలవలస తదితర పట్టణాల్లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన మర్వాడీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరు వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. వీరికి ఈ పండగ ఎంతో ముఖ్యమైనది. ఇప్పుడిప్పుడే మన రాష్ట్రంలో కూడా దీపావళి రోజు లక్ష్మీపూజతో పాటు.. ధన త్రయోదశి రోజున కొత్త బంగారు వస్తువుల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ధన త్రయోదశి పండగ అకాల మరణ భయాన్ని పోగొట్టడానికి యమధర్మరాజును ప్రార్థించే రోజు. సంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవిని, కుబేరుడిని పూజిస్తారు. అంతేకాకుండా ఆయుర్వేద వైద్యానికి మూల పురుషుడైన ధన్వంతరి జన్మించినందున ధన్వంతరి జయంతిగా జరుపుకుంటారు.

ఐదు రోజుల పండగ

హిందూ సంప్రదాయంలో ఇది ఐదు రోజుల పండగగా జరుపుకుంటారు. తొలిరోజు వసూ బారాస్ పేరుతో మార్వాడీలు ఆవు, దూడలకు పూజిస్తారు. ధన త్రయోదశి ముందు అంటే ద్వాదశి రోజున ఆవు, దూడలకు పూజ చేస్తారు.

● ధన త్రయోదశి రోజున సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో పూజ గదిలో లక్ష్మీదేవి, కుబేరుడు, ధన్వంతరి పీఠం వద్ద ధనం, బంగారు, వెండి ఆభరణాలు ఉంచుతారు. ముత్తయిదువలు కూడా బంగారు ఆభరణాలు ధరిస్తారు. ఇంటికి దక్షిణ భాగంలో నెయ్యి లేదా నువ్వుల నూనెతో దీపం వెలగిస్తారు. ఇది యమధర్మరాజును సంతోష పెట్టేందుకని వారి నమ్మకం. ఆరోగ్యంగా ఉండేందుకు ధన్వంతరిని పూజిస్తారు.

● మూడో రోజు దీపావళి పండగ జరుపుకుంటారు. సూర్యాస్తమయం తర్వాత ప్రదోష కాలంలో లక్ష్మీదేవిని బంగారు ఆభరణాలు, వెండి రూపాయలు, ధనంతో అలంకరించి వివిధ రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పిస్తారు. ఆ తర్వాత బాణసంచా కాల్చుతారు.

● నాలుగో రోజున యథావిధిగా పూజలు నిర్వహిస్తారు. భార్య పూజా మందిరంలో భర్తకు హారతి ఇస్తారు. దీనికి ప్రతీకగా భర్త బహుమతి అందిస్తారు.

● కార్తీక మాసంలో భగినీహస్త భోజనం రోజున మార్వాడీలు బహూబజీ పేరుతో ఈ పండగ జరుపుకుంటారు. సోదరుడికి సోదరి రక్ష కట్టి హారతి ఇస్తుంది. సోదరి ఇంట్లో భోజనం చేసి కానుక ఇస్తాడు. ఇంకొందరు ఈ పండుగను పదిహేను రోజుల వరకు నిర్వహిస్తారు.

స్థానికులతో కలిసి..



మేము మార్వాడీలం అనే భావన లేకుండా ధన త్రయోదశి పండగను స్థానికులతో కలిసి సందడిగా జరుపుకుంటాం. లక్ష్మీ పూజలా ధన త్రయోదశి పూజలు చేస్తాం.

- శివానీ, నరసన్నపేట

ఇదే పెద్దపండగ



ధన త్రయోదశికి ముందు పదిహేను రోజుల నుంచి పిండి వంటలు చేస్తాం. వివిధ రకాల స్వీట్లు తయారు చేసి ప్రసాదంగా ఉంచుతాం. ఇదే మాకు పెద్ద పండగా జరుపుకుంటాం. నా చిన్నతనం నుంచి ఇదే ఆచారం పాటిస్తున్నాం.

- సునంద, నరసన్నపేట

దశాబ్దాలుగా ఇక్కడే..



మా నాన్న బంగారం ద్రావకం పనికోసం 1959లో ఇక్కడికి వచ్చారు. నేను పదో తరగతి పాసైన తర్వాత ఇక్కడికి వచ్చేశాను. అప్పటి నుంచి ధన త్రయోదశి పండగ ఇక్కడే జరుపుకుంటున్నాను.

- నానాజీ గాడ్గె, నరసన్నపేట

ఆ విషాదం.. మరువలేనిది

(ఐదో పేజీ తరువాయి)

మండలం అలమండ గ్రామాల మధ్య నిలిచి ఉన్న పలాస పాసింజర్ రైలును కొత్తవలస రైల్వే స్టేషన్ నుంచి వస్తున్న రాయగడ పాసింజర్ రైలు బలంగా ఢీకొంది. పట్టాల నుంచి మూడు బోగీలు తప్పాయి. ఘటనా స్థలంలో పదిమంది అశువులు బాశారు. ముఖాలను కూడా గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమయ్యాయి. పలాస రైలు గార్డు బోగి పూర్తిగా ధ్వంసమైంది. అందులోని గార్డు అక్కడికక్కడే మృతిచెందారు. రాయగడ రైలు ఇంజన్, వెనుక బోగి దెబ్బతింది. ఇంజన్‌లో వున్న ఇద్దరు డ్రైవర్ల(లోకోపైలెట్‌లు) ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఎటు చూసినా చీకటితో నిండివుండడం.. ప్రమాదం జరిగిన రైలు పట్టాలకు ఆనుకుని ఇరువైపులా మామిడితోటలు, వరి పంట పొలాలు వుండడంతో సకాలంలో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. సమీప గ్రామాల ప్రజల సహకారంతో మృతదేహాలను, క్షతగాత్రులను రాత్రంతా వెతికారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన కుటుంబాలకు ఈరైలు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విశాఖలో కూలిపనికి వెళ్లిన వారు.. వివిధ పనుల నిమిత్తం వెళ్లి మరో రెండు, మూడు గంటల్లో ఇళ్లకు చేరుకుంటారని ఎదురు చూసేవారందరికీ గుండెలను మెలిపెట్టే దుర్వార్త తెలిసింది. కొన్ని గంటల పాటు ప్రమాద స్థలం కన్నీటిమయమైంది. ఘటనాస్థలం నుంచి రెండు బోగిలను తొలగించేందుకు రైల్వే శాఖకు రెండు రోజులు పట్టింది. ఈలైన్‌లో రైళ్ల పునరుద్ధరణకు ఒకరోజు సమయం తీసుకోవాల్సి వచ్చింది.

తప్పిదాన్ని కప్పి పుచ్చుకున్న రైల్వేశాఖ

సిగ్నల్ వ్యవస్థలో జరిగిన లోపంతో ఈ ప్రమాదం జరిగినట్లు తొలుత ప్రచారం జరిగింది. అదివారం సాయంత్రం (2023 అక్టోబర్ 29)సాయంత్రం 6.30 గంటల సమయంలో కొత్తవలస రైల్వే స్టేషన్ నుంచి వచ్చిన పలాస పాసింజర్ రైలు ఇక్కడన్న మిడిల్ లైన్ పట్టాలపై ఆగింది. ఇదే రైల్వే స్టేషన్ నుంచి మిడిల్ లైన్ పట్టాలపై వచ్చిన రాయగడ పాసింజర్ రైలు రాత్రి 7.00గంటల సమయంలో వెనక నుంచి ఢీకొట్టింది. పలాస పాసింజర్ రైలు ఆగివున్న విషయం రాయగడ పాసింజర్ రైలు డ్రైవర్ (పైలెట్)లకు తెలియకపోవడంతో ఢీకొట్టి ఉంటుందని అందరూ అంచనా వేశారు. అప్పటికి రెండు రోజుల క్రితం నుంచి సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పని చేయనట్లు రైల్వే అధికారుల దృష్టిలో వుంది. ఈ విషయం బయటకు పొక్కింది. నిలబడి వున్న పలాస పాసింజర్‌ను వెనకనుంచి రాయగడ పాసింజర్ రైలు ఢీకొట్టడానికి కారణమదేనని రైల్వే అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. కానీ రాయగడ పాసింజర్ మితిమిరిన వేగంతో రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని రైల్వేశాఖ తెల్చేసింది. ప్రమాదం ఎలా జరిగిందో చెప్పేందుకు ఎవరూ లేకపోవడంతో రైల్వేశాఖ తనకు అనుకూలంగా మల్చుకుంది. రైల్వేశాఖ ఆటోమేటిక్ సిగ్నిలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చాక కూడా రైళ్లు ఢీకొనడం ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తోంది.



నిరసన తెలుపుతున్న దృశ్యం(ఫైల్)

రికార్డుల్లో పేర్లు లేవు

(ఐదో పేజీ తరువాయి)

సమగ్ర సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా 2023లో సంబంధిత కొర్లాం రెవెన్యూ పరిధిలో రైతులకు పంట పొలాల్లో ఫొటోలు తీశారు. దీంతో తమ పొలాలకు శాశ్వత పట్టాలతో రక్షణ ఉంటుందని రైతులు భావించారు. ఈ క్రమంలో కొంతమంది రైతులు బ్యాంకు రుణాల రెన్యూవల్స్ కోసం మీ-సేవా కేంద్రాలకు వెళ్లి సర్వేనెంబర్లు చెప్పి అడంగళ్, 1బీ ప్రింట్లు కావాలని అడిగారు. సర్వేనెంబర్లు పరిశీలించిన మీ-సేవ నిర్వాహకులు అడంగళ్, 1బీలు మీపేరున రావడం లేదని తెలిపారు. సర్వే నెంబర్లు బ్లాక్ చేసి ఉన్నాయన్నాయన్నారు. 'మీ-భూమి' పోర్టల్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి పేరుతో ఇనాం భూములుగా కనిపిస్తున్నాయని చెప్పడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో కొన్నాళ్ల కిందట తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కానీ ఇంతవరకూ న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో.. భూముల రీసర్వే సమయంలోనే వైసీపీ పెద్దల సహకారంతో కొంతమంది రికార్డుల్లో పేర్లు మార్చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. వంశపారపర్యంగా వస్తున్న భూముల పేర్లు మార్పులో రెవెన్యూ అధికారుల హస్తం కూడా ఉందని విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయాని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

కొర్లాం రెవెన్యూ పరిధిలోని వంశపారపర్యంగా రైతులకు సంక్రమించిన 250 ఎకరాల్లో పలు నెంబర్లు లాక్ చేయడం దురదృష్టకరం. గతంలో ఈ సర్వే నెంబర్లకు సంబంధించి అడంగళ్, 1బీ పత్రాలు ఉండగా వీటితోనే క్రయవిక్రయాలు సైతం జరిగాయి. ఏ ఆధారంతో సర్వేనెంబర్లు మార్చారో అర్థం కావడం లేదు. రైతులకు న్యాయం చేసి యథాస్థితిలో 1బీ, అడంగళ్ ఇప్పించాలి.

- రాంబుడ్డి గణపతి, కొర్లాం

రీ సర్వే నిర్వహిస్తున్నాం

కొర్లాం రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల విషయం.. జేసీ దృష్టిలో ఉంది. నవంబరు 10వ తేదీలోగా రీసర్వే నిర్వహించి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు సర్వేనెంబర్లలో రీసర్వే నిర్వహించి జేసీకి నివేదిక అందజేస్తాం.

- బి.అప్పలస్వామి, తహసీల్దార్, సోంపేట

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆశ్వయుజ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఇప్పిలి షణ్ముఖశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం →



రక్తదానంపై అపోహలు విడనాడాలి: కలెక్టర్


రక్తదాతకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానంపై అపోహలు వీడి రక్తదానంచేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు మెడికోవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. రిమ్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన పోలీసు సిబ్బందికి కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్,ఎస్పీ చేతులమీదుగా డొనేషన్ ధ్రువపత్రాలు, రెడ్‌క్రాస్ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా టెక్కలి, కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో ఈ నెల 29,30 తేదీల్లో రక్తదాన, వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎస్పీ జీహెచ్ వివేకానంద, ఏఆర్‌డీఎస్పీ ఎల్.శేషాద్రి, సీఐలు జి.ఉమామహేశ్వరరావు- ఎం.అవతారం, సత్యనారాయణ, సూర్యనారాయణ, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్


ఇచ్ఛాపురం: మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ డిమాండ్ చేశాయి.సోమవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థకార్యాలయం వద్ద ఆయా కార్మిక సంఘాలు నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.బలరాం, ఉపాధ్యక్షుడు ఎ.గణేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్ వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశ్‌రావు ఎ.జ్యోతీప్రసాద్, రాఘవ పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మునిసిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. సోమవారం ఇచ్ఛాపురంలో మునిసిపల్ కార్మికులతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.దశలవారీ ఆందోళనల్లో భాగంగా సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో డి.శంకరరావు, కేశవ బెహరా, బబూలా లిమ్మాయి, శాంతారావు, శివ, సంతోష్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో రన్నర్‌గా శ్రీకాకుళం


ట్రోఫీని అందుకుంటున్న జిల్లా క్రీడాకారిణులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా బాలికల సబ్ జూనియర్స్ ఖోఖో జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో రన్నర్‌గా నిలిచింది. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కానిపాకంలో జరిగిన పోటీల్లో ఫైనల్‌లో తూర్పుగోదావరిపై శ్రీకాకుళం జట్టు ఓటమిపాలై ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈమేరకు జిల్లా క్రీడాకారులకు ఖోఖో జిల్లాఅసోసియేషన్ అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, కార్యదర్శి సీహెచ్ ఫల్గుణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాధుశ్రీనివాసరావు అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక

జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేటలో చదువుతున్న మెట్ట హర్షవర్ధన్, పూజారి కళ్యాణరామ్, చితాడ జస్వంత్ ఎంపికయ్యారని సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు కె.నరసింహరాజు, కార్యదర్శి ఎస్.లక్ష్మీదేవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంవీ రమణ తెలిపారు. ఈ పోటీలు నవంబరు ఆరు నుంచి పదో తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరుగుతాయి.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

● జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు


అంబటి కృష్ణారావు

అరసవల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఒకప్రకటనలో డిమాండ్‌చేశారు.లేనిపక్షంలో ప్రజల తరపున తమ పార్టీ పోరాటాలు చేస్తుందని తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికల ముందు కూటమిగా ఏర్పడి పేద, మధ్యతరగతి వర్గాలకు సూపర్‌సిక్స్ పేరుతో హామీఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని తుంగలోతొక్కి విద్యుత్‌చార్జీలను పెంచడం దారుణమని పేర్కొన్నారు.టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బషీర్‌బాగ్‌లో ప్రజలు, రైతులపై లాఠీచార్జీ చేయించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

రణస్థలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక షిర్డీ సాయిబాబ ఆలయం ఎదురుగా జాతీయరహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జేఆర్‌పురం కాపువీధికి చెందిన యడ్ల నారాయణమ్మకు తీవ్ర గాయలయ్యాయి. కుటుంబ సభ్యల కథనం మేరకు..నారాయణమ్మ రోడ్డుదాటుతుండగా శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు వస్తున్న ద్విచక్రవాహనంఢీకొంది.గాయపడిన నారాయణమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వైద్యులపై ఫిర్యాదు

ఆమదాలవలస,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాసర్వజన ఆసుపత్రి వైద్యులపై సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు కనుగులవలస సర్పంచ్ నూక అప్పలసూరనాయుడు తెలిపారు. నకిలీ పింఛన్లతో పాటు తప్పుడు ధ్రువపత్రాలు మంజూరు చేసిన రిమ్స్ వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

యూకేలో స్వాతి సోమనాథన్ నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన చేస్తున్న స్వాతి సోమనాథన్

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యూకే తదితర దేశాల్లో సాంస్కృతిక పర్యటనలో భాగంగా కళేపల్లి సంప్రదాయం కూచిపూడి గురుకులం డైరెక్టర్, కూచిపూడి నృత్య కళాకారిణి స్వాతి సోమనాథన్ రెండు నెలలుగా శిష్యులతో కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చారు. ఐదేళ్ల వ్యవధిలో యూకేలో ప్రదర్శన ఇవ్వడానికి సైడా ఇంటర్నేషనల్, యూకే సీఈవో టి.పద్మావతి ఆహ్వానం మేరకు వెళ్లారు.ఈ మేరకు సోమవారం కళ్ళేపల్లి సంప్రదాయ భవనంలో స్వాతిసోమనాథన్ విలేకరులతో మాట్లాడారు. యూకేలో ఆటమన్ కల్చర్ ఫెస్టివల్ పేరిట జరిగిన ఈవెంట్స్‌లోప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. కామసూత్ర నృత్యంలో సీతంపేటకు చెందిన అంజలి కూడా ప్రదర్శనఇచ్చారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో సోలోలు, నృత్యరూపకాలతోపాటు, ఎనిమిది వర్క్‌షాపులను కూడా నిర్వహించామని చెప్పారు. లండన్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్, కూచిపూడి నృత్యాలను తమ శిష్యులతో ప్రదర్శించినట్లు తెలిపారు. లండన్‌లో ఓల్డ్‌హం టెంపుల్, ఫ్యూజ్ రాక్ సెంటర్, కన్వెన్షన్ సెంటర్, భారతి విద్యా భవన్‌లో ద్రౌపతిగా ప్రదర్శన ఇచ్చామని చెప్పారు.

బిల్లులు కాక.. పనులు సాగక

● అన్నదాతకు సాగునీటికి తప్పని అగచాట్లు ● ఇదీ కళింగపట్నం ఎత్తిపోతల పథకం పరిస్థితి


నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకానికి నిర్మించిన పంపుహౌస్

గార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):గార మండలంలోని శివారు ప్రాంతాల్లో వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరందించే కళింగపట్నం ఎత్తిపోతల పథకం బిల్లులు వైసీపీ హయాంలో చెల్లించకపోవ డంతో పనులు ముందుకుసాగలేదు. దీంతో ఆయకట్టుకు నీరందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నిరుపయోగంగా పరికరాలు

కళింగపట్నం ప్రాంతంలో బైరి కాలువ శివారు ప్రాంతంలో గల 2,300 ఎకరాలకు సాగు నీరందించే ఉద్దేశంతో 2018 ఫిబ్రవరి 24న రూ.275.83 కోట్ల నిధులతో గార వద్ద వంశధార నది ఒడ్డున ఎత్తిపోతల పథకం కోసం భూమి పూజలు చేశారు. ఏపీఎస్ఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణలో పైపులైన్లు, ఊటబావినిర్మాణం, విద్యుత్ లైన్లు వేశారు. సుమారుగా 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకుసాగలేదు. దీంతో నీటికోసం అన్నదాతకు అగచాట్లు తప్పడంలేదు.ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో ఎత్తిపోతలపథకంపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు మోటార్లు కూడా అప్పట్లోనే తెప్పించారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఊటబావి చుట్టూ పొదలు భారీగా పెరిగాయి.విద్యుత్ పరికరాలు తుప్పు పడుతున్నాయి.కాగా ఎత్తిపోతల పథకం పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని ఇటీవలఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లామని ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరమణమూర్తి తెలిపారు.


ఎత్తిపోతల పథకం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పనులు కాక.. పరాయిపంచన బోధన

● మూలకుచేరిన తాగునీటి యంత్రం

● ఇదీ కొత్తకుంకాంలో ప్రాథమిక పాఠశాల పరిస్థితి


అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనం పనులు

లావేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకుంకాంలో ప్రాథమిక పాఠశాల భవనం పనులు మూడేళ్లుగా పూర్తికాకపోవడంతో పరాయిపంచన బోధన సాగిం చాల్సివస్తోంది. స్థానికంగా అందుబాటులో ఉన్న గోపాలమిత్ర (పశువుల ఆసుపత్రి)లో పాఠ శాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పాఠశాలభవనం నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.26.99 లక్షలు విడుదలచేసింది. భవనం పనులు 2022 ఆగస్టు 16న పనులు ప్రారంభమయ్యాయి. ఇంతలో వైసీపీ ప్రభుత్వంమారడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఇక్కడ పక్కా భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. భవనం పనులు పూర్తికాకపోవడంతో వేలాది రూపాయిల వ్యయంతో కొనుగోలు చేసిన తాగునీటి యంత్రం వాడకంలోకి రాకపోవడంతో మూలకు చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు పనులు పూర్తిచేసి భవనం అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా త్వరలో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎంఈవో మురళి తెలిపారు.

ఇంటర్వ్యూ

డిసెంబరు నాటికి పల్లె పండుగ పనులు పూర్తి చేయడానికి చర్యలు

● ఎంపీడీవో రామమోహనరావు



గార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గార మండలంలో డిసెంబరు నాటికి ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారంతో మంజూరైన పల్లె పండుగ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఎస్. రామమోహనరావు తెలిపారు.

ప్రశ్న: మండలానికి పల్లె పండుగ పనులు ఎన్ని, ఏవేవి మంజూరు చేశారు.

జ: 25 పంచాయతీలకు సీసీ రోడ్లు, కాలువలు, గోకులాలు తదితర 351 పనులు మంజూరయ్యాయి.

ప్రశ్న: ఎన్ని కోట్ల రూపాయలతో పనులు చేస్తున్నారు.

జ: రూ. 18.19 కోట్లతో చేయిస్తున్నాం. వీటిలో సీసీ రోడ్లకు రూ.7.60 కోట్లు, కాలువలకు రూ. 9.50 కోట్లు, గోకులాలకు రూ.49 లక్షలు, రూ.41 లక్షలతో చేపలు ఎండపెట్టుకునే సీసీ ప్లాట్‌ఫారాలు, రూ. 19 లక్షలతో రెండు చేపలు చెరువులు పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మౌలికసౌకర్యాలు అంతంతగానే ఉన్నాయి.

జ: 14 కేంద్రాలకు గాను ఒక్కోచోట రూ.30 వేలుతో పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంత వచ్చాయి.

జ: రూ.65 లక్షలు వచ్చాయి.

వైసీపీ పాలనలో భూదందాలు: కూన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూదందాలకు పాల్పడ్డారని, ఐదేళ్లు పరిపాలించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి భూబకాసరుడిగా మారాడని ఎమ్మెల్యే కూనరవికుమార్ ఆరోపించారు.సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని రావికంటిపేటలో నిర్వహించిన రీసర్వే రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూమి రీసర్వే పేరుతో రైతుల భూములకు మంగళం పాడడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు.కార్య క్రమంలో తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, టీడీపీ నాయకులు సనపల ఢిల్లీశ్వరరావు, భాస్కరరావు, బోర గోవిందరావు, శివ,రామారావు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

నాగావళి నుంచి తాగు నీరు

నాగావళి నది నుంచి తాగునీటిని ప్రజలకు త్వరలో అందిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. తొగరాంలో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నియోజకవర్గాన్ని పరిపాలించిన తమ్మినేని సాధించింది ఏమీ లేదన్నారు. కలివరం పంచాయతీలో 46 పింఛన్లను తొలగించిన ఘనత మాజీ స్పీకర్ తమ్మినేనికే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సుజాత, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, అమర్నాథ్, విద్యాసాగర్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, బొడ్డేపల్లి గౌరీపతి, లక్ష్మీనారాయణ, హనుమంతు బాలకృష్ణ, తమ్మినేని నాని పాల్గొన్నారు.

రైతులు సరైన సమాచారం అందించాలి

అఖిల భారత పశుగణనకు వచ్చే అధికారులకు తమ పశువులకు సంబంధించి రైతులు సరైన సమాచారం అందించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు ఆధ్వర్యంలో భారత పశుగణన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్, పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యం, సహాయ సంచాలకులు, హేమలత, ఓంకార్, జ్యోత్స్న వెంకటరావు, కరుణ, సతీష్ పాల్గొన్నారు.

మెటీరియల్ పనుల్లో నాణ్యత పాటించాలి

● డ్వామా పీడీ సుధాకరరావు


పనులను పరిశీలిస్తున్న సుధాకరరావు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మెటీరియల్ కాంపోనెంట్ పనులు, సిమెంట్ రహదారులు, కాంక్రీట్ కాలువల పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ బి.సుధాకరరావు సిబ్బందికి సూచించారు. సోమవారం శ్రీకాకుళం మండలంలోని కిష్టప్పపేటలో జరుగుతున్న కాంక్రీట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు జరుగుతున్న సమయంలో పరిశీలించి, నిబంధనల మేరకు నాణ్యతను పాటించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న రోడ్లు, కాలువల పనులతో పాటు ఇతర పనుల వల్ల గ్రామాల్లో శతశాతం మెరుగైన సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సీతారాం, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ బాలాముకుందబాబు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి

టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి కృషి చేయాలని వెలుగు ఏపీఎం పి.మనోరత్నం అన్నారు. సోమవారం స్థానిక వెలుగు భవనంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తరచూ సమావేశాలు నిర్వహించడం ద్వారా సంఘాలు బలోపేతమవుతాయన్నారు.

'పీజీఆర్‌ఎఫ్'లో 48 వినతులు


అర్జీదారునితో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు నమోదు, పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎఫ్)లో శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ప్రజాల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ మేరకు 48 వినతులు వచ్చాయి. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజాఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరగాగా పరిష్కరిం చాలని కోరారు.

నవంబరులో నాక్ బృందం పరిశీలన


మాట్లాడుతున్న స్వామి

ఆమదాలవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నవంబరులో నాక్ బృందం పరిశీలించనుందని ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎన్ స్వామి తెలిపారు. సోమవారం ఆమదాలవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఏర్పాటైన తర్వాత 2016లో నాక్ బృందం పరిశీలించి బీ గ్రేడ్‌గా గుర్తించిందని తెలిపారు.

బండి సంజయ్‌ను కలిసిన ఎన్ఈఆర్


సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న ఎన్ఈఆర్

రణస్థలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మార్యద పూర్వకంగా సోమవారం కలిశారు. తొలుత విశాఖపట్నం విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరంలో ఓ హోటల్లో జరిగిన సమావేశానికి ఆయనతో పాటు ఎన్ఈఆర్ హాజరయ్యారు. ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఆయనతో చర్చించారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకుపేట నుంచి కళ్లేపల్లి వరకు రహదారి మార్గంలో విద్యుత్ దీపాలను సోమవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ విద్యుత్ విభాగం సిబ్బంది సోమవారం ఏర్పాటుచేశారు. ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్ వేదికలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి పలు గ్రామాల ప్రజలు తీసుకొచ్చిన విషయం విదితమే.

పదోన్నతి ఉత్తర్వులపై అభ్యంతరాలు తెలియజేయండి

గుజరాతీపేట,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్‌యాజమాన్యంలోని హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతి కోసం అమరావతినుంచి పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖ కార్యాలయం అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ తత్సమాన కేటగిరిలో ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వారి వెబ్‌సైట్‌లో పొందపరిచినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వాటిపై ఎటువంటి అభ్యంతరా లుఉన్నా నవంబరు ఒకటోతేదీ సాయం త్రం ఐదుగంటల్లోగా తెలియజేయాలని కోరారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన

గుజరాతీపేట,అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో సర్వైకల్ కాన్సర్‌పై శశిధర్ ఆసుపత్రి సిబ్బంది విద్యార్థులకుసోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచం ద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో

జి.సిగడాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు అందిం చాలని ఏవో ఎర్రా శారద కోరారు. సోమవారం జి.సిగడాం, సర్వేశ్వరపురంలో ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని కోరారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రైం కార్నర్

బందరువానిపేటలో సీమెన్ ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

గార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బందరువానిపేటకు చెందిన బొమ్మనాట రమేష్ (34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సీమెన్‌గా పనిచేస్తున్న రమేష్ ఐదురోజుల కిందట ఇంటికి వచ్చాడు. వచ్చిన దగ్గర నుంచి మద్యం తాగుతున్నాడు. పిల్లలున్నారు, ఎందుకు తాగడం, ఇల్లు కూడా కట్టాం కదా అని భార్య రమేష్‌ను ప్రశ్నించింది. భార్య హైమ పిల్లలను తీసుకొని సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లింది. మనస్థాపానికి గురై ఆ సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొనఊపిరితో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తల్లి తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ టి.చంద్ర మోహన్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


లోకనాథం (ఫైల్)

సోంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జింకిభద్రకు చెందిన తాళ్ల లోకనాథం(62) చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లోకనాథం పొలం పనులు చేస్తుండగా ఆదివారం సాయంత్రం పాముకాటేసింది. దీంతో స్థానికులు సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి సర్వజన ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్‌చేశారు.ఈ మేరకు అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం లోకనాథం మృతి చెందాడు.

నెల్లూరులో నౌపడ వాసి..


కృష్ణారావు (ఫైల్)

సంతబొమ్మాళి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చెముడుగుంట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నౌపడకు చెందిన గిన్ని కృష్ణారావు (48) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కృష్ణారావు గత కొంత కాలంగా నెల్లూరులోని ఓ మిల్లులో పనిచేస్తున్నాడు. ఆదివారం రైస్‌మిల్లుకు వెళ్లేందుకు రోడ్డు దాటు తుండగా గుడూరు నుంచి నెల్లూరు మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి సోమవారం స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు కృష్ణారావు నిరుపేద అని అతని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇసుక లారీ సీజ్

సరుబుజ్జిలి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవలస, పెద్దపాలెం గ్రామాల మధ్య ఉన్న ఇసుక నిల్వలపై సోమవారం అధికారులు దాడులు నిర్వహించారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన్, ఎస్ఐ టి.రాజేష్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వచేసిన ఇసుక పోగులకు గుర్తించారు. మూడు ఇసుక పోగులు, ఇసుక లోడుతో ఉన్న లారీని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. లారీ డ్రైవర్ పరారీ అయ్యాడన్నారు. ఇసుక పోగులు, లారీలను గనులు శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

కిష్టుపురంలో కొట్లాట: ఇరువర్గాలపై కేసు నమోదు

కోటబొమ్మాళి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కిష్టుపురంలో ఆదివారం కారుపై మూత్ర విసర్జన చేసిన ఘటన నేపథ్యంలో జరిగిన కొట్లాటలో ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఆయన పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ధర్మాన శ్రీను.. తన కారుపై చల్ల అప్పలరాజు మూత్ర విసర్జన చేశాడన్న అనుమానంతో ఫిర్యాదు చేశారు. తాను కారు పక్కన మూత్ర విసర్జన చేశానని, కారుపై పోయలేదని, అయితే ధర్మాన శ్రీను తనపై దాడి చేశారని అప్పలరాజు ఫిర్యాదు చేశారన్నారు. ఈ రెండు ఫిర్యాదుల మేరకు ఫిర్యాదు దారులతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. గాయపడిన ఇరువర్గాల వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విశ్వనాథపురంలో 11 మందిపై..

కోటబొమ్మాళి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల విశ్వనాథపురం పంచాయతీ గొల్లపేటలో జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన అగూరు హరికృష్ణ ఇంట్లో బంగారం చోరీకి గురైంది. అయితే గ్రామానికి చెందిన వంజరాపు లక్ష్మణరావు భార్య తవిటమ్మ దొంగిలించిందన్న అనుమానంతో వీరి మధ్య విభేదాలు తలెత్తి ఆదివారం కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనపై లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంగూరు హరికృష్ణతో పాటు ఐదుగురు, అగూరు హరికృష్ణ ఇచ్చిన పిర్యాదు మేరకు వంజరాపు లక్ష్మణరావుతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నరసన్నపేట, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నర్సింగరాయుడు పేట వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఉర్లాం గ్రామానికి చెందిన డి.పద్మ తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. సోమవారం మేనల్లుడి ద్విచక్రవాహనంపై పద్మ లుకలాం వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలపాలవడంతో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కుమారుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు.

గౌతు కుటుంబమంటేనే సంస్కారం


మాట్లాడుతున్న హేమబాబు చౌదరి

కాశీబుగ్గ, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో గౌతు శిరీష 40 వేల ఓట్ల తేడాతో నిన్ను ఓడించారన్న విషయం గుర్తుంచుకోవాలని వజ్రపు కొత్తూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమ బాబు చౌదరి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజునుద్దేశించి అన్నారు. సోమవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గౌతు శిరీషకు కుటుంబం సంస్కారం నేర్పలేదని ఏదో పిచ్చి మాటలు ఆడుతున్నావని, నీకు సంస్కారం ఉందా అని ప్రశ్నించారు. గౌతు కుటుంబమంటేనే సంస్కారమని, మచ్చలేని రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వారసురాలు శిరీష అని అన్నారు. ఆమెను అప్పలరాజు నిత్యం నోటికొచ్చినట్లు మాట్లాడడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌కు గేట్లు వేస్తానని ప్రకటించావు కదా.. కనీసం స్టేషన్ గేటు తాకగలవా అని మాజీ మంత్రిని ప్రశ్నించారు.

అమానవీయ ఘటనలకు ఊతమివ్వడం సరికాదు: తమ్మినేని

కోటబొమ్మాళి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో అమానవీయ ఘటనలకు ఊతమివ్వడం సరికాదని, అది రాజకీయ లక్షణం సరికాదని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొట్లాటలో గాయపడిన కిష్టుపురానికి చెందిన మహిళను సోమవారం స్థానిక సామాజిక ఆసుపత్రిలో పరామర్శించారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల అండదండలతో అరాచకాలు పెరిగిపోతున్నాయని, పోలీసులు కూడా వారి కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని విమర్శించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఎటువంటి అరాచకాలు చేసినా ఫిర్యాదులు చేస్తే కేసులు పెట్టే పరిస్థితి లేద న్నారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళతానన్నారు. ఆయన వెంట వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మందస, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గాను పౌరశాస్త్రం గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.తేజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్టుగ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. రెండు సెట్ల నకలు పత్రాలు, ఫొటోలతో కలిపి బయోడేటాను నవంబరు ఒకటి లోగా అందజేయాలన్నారు. 2వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు డీవీఈవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని, విశ్రాంత అధ్యాపకులకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ఇంతలో ఎంత తేడా..



ఫొటో 1: 2022 ఆగస్టు 19న మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గురిటి సూర్యనారాయణ ఇంటిని అక్రమంగా నిర్మించారని, తక్షణం తొలగించాలని అప్పటి మంత్రి అప్పలరాజు రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అయితే ఆ ప్రయత్నాన్ని స్థానిక ప్రజలు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ నేపథ్యంలో సూర్యనారాయణకు మద్దతు తెలిపేందుకు వచ్చిన అప్పటి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు పలాస రాగా లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద భారీ స్థాయిలో పోలీసులు మోహరించి అడ్డగించారు. ముందస్తు నోటీసులిచ్చి వారి సంతకాలు తీసుకుని అక్కడి నుంచి వెనక్కి పంపించేశారు.

ఫొటో 2: 2024 అక్టోబరు 28.. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యంపై నమ్మకం.. స్వేచ్ఛ నిరూపితమైంది. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం సోమవారం సాకారమైంది. పలాసలో రెండు రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలు, బాలికపై చేయి చేసుకున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి అప్పలరాజు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో అప్పలరాజును పరామర్శించేందుకు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పలాస రాగా ఆయనకు ఎటువంటి అడ్డంకి కల్పించకుండా బందోబస్తుతో తీసుకువచ్చారు. ఈ ఇద్దరూ కలిసి బాధితురాలి బంధువులను స్వేచ్ఛగా పరామర్శించారు. ఈ రెండు వ్యవహారాలను చూసిన ప్రజలు వైసీపీకి, టీడీపీ ప్రభుత్వాలకు ఉన్న తేడాను స్పష్టంగా గమనించారు.

-పలాస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి వద్ద పనులు చేపడుతున్నందున దయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు సత్యవరం, మారుతీనగర్, శ్రీరామనగర్, విజయలక్ష్మీనగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోండి

మెళియాపుట్టి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాతపట్నం వైటీసీలో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలలో మృతి చెందిన విద్యార్థిని సవర లావణ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంఘ నాయకుడు సవర కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం సీతంపేట ఐటీడీఏలో పీవోను కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. బాలిక ఆత్మహత్యపై దర్యాప్తు నిర్వహించాలని, మెళియాపుట్టిలో నిర్మించిన గదుల్లో తరగదులు నిర్వహించాలని, రక్షణ గోడ నిర్మించాలని కోరామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) సైబర్ నేరాలపై యువత మరింత అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో ప్రజలను అవగాహన కలిగించాలని సీఐ జె. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉర్లాం మహిళా కళాశాలలో 'సంకల్పం'లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై దాడులు నేపథ్యంలో ఎలా ప్రతిఘటించాలి, దాడులు నుంచి రక్షణ ఏవిధంగా పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఉర్లాం మహిళా కళాశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకన్న స్వామి ఆదాయం రూ.1.97 లక్షలు

నరసన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమంలో సోమవారం నిర్వహించారు. ఈఏడాది జూన్ నుంచి అక్టోబరు వరకు రూ.1.97 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో రవి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, ధర్మకర్త పొట్నూరు చిన్నవీరభద్రస్వామి, ప్రధాన అర్చకులు కృష్ణామాచార్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

నరసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) పాలసీదార్ల బోనస్ పెంచాలని, జీఎస్టీను రద్దు చేయాలని ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం స్థానిక కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కొద్దిరోజులుగా చేపడుతున్న నిరసనలో భాగంగా ఆందోళన చేపట్టారు. క్లాబ్యాక్ క్లాజ్‌ను రద్దు చేయాలని, ఏజెంట్లకు మెడిక్లెయిమ్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘ నాయకులు ఉప్పాడ పూర్ణారావు, గడ్డేను, ఎల్వీ రమణమూర్తి, అప్పన్న, పిరియా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా జాబితా ఇవ్వండి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-2024 మధ్య నియోజకవర్గంలో మంజూరైన మత్స్యకార భరోసా లబ్ధిదారుల జాబితా, ఈ పథకం విధి విధానాలను అందించాలని మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో తహసీల్దార్ డీవీ సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వైసీపీ నేత దాడిలో గాయపడి పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామ కృష్ణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సూరాడ మోహనరావు, సాంబమూర్తి, శశిభూషణ్ పాల్గొన్నారు.

31న కోరన్న-మంగన్న వర్ధంతి

హరిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన ఆరికి కోరన్న, కొండగొర్రి మంగన్నల 57వ వర్ధంతి కొండలోగాంలో ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు సీపీఎం న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఆహార శుద్ధిపై అవగాహన

పలాసరూరల్,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆహార శుద్ధి కార్యక్రమంపై అవగాహన కలిగిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు హాజరుకావాలని కోరారు.

సెటిల్‌మెంట్ కింగ్ అప్పలరాజే..

● మాజీ మంత్రి గౌతు శివాజీ


మాట్లాడుతున్న మాజీ మంత్రి గౌతు శివాజీ

పలాస, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో సెటిల్‌మెంట్ కింగ్ మాజీ మంత్రి అప్పలరాజు అని, ఇకపై తాము గాంధీ సిద్ధాంతాలను ఆచరించమని, ఒక చెంపమీద కొడితే రెండు చెంపలు వాయిస్తామని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల బాలికలపై అఘాయిత్యం జరిగితే మాజీ మంత్రి అప్పలరాజు తన కుమార్తె, ఎమ్మెల్యే శిరీషపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తాము ఏనాడు సెటిల్‌మెంట్లను ప్రోత్సహించలేదన్నారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎటువంటి వివాదాలకు దారిచూపలేదన్నారు. నువ్వలరేవుకు చెందిన విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందితే అప్పట్లో మంత్రిగా ఉన్న అప్పలరాజు చేసిన రాజకీయం, సెటిల్‌మెంట్లు ప్రజలకు తెలిసినవేనన్నారు. టీడీపీ కార్యకర్తలపై వస్తున్న ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. కొర్ల విష్ణు వ్యవహారం ఉద్దేశ పూర్వ కంగా వైసీపీ నాయకులు చేసినట్లు కనిపిస్తోందని, ఇద్దరు వ్యక్తుల కొట్లాట తరువాత భారీ సంఖ్యలో ఆ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడం వెనుక ఉద్దేశమేమిటని ప్రశ్నిం చారు. పలాస అభివృద్ధిలో ఎమ్మెల్యే శిరీష ముందంజలో ఉన్నారని, గెలిచిన వెంటనే వంశధార నీరు తీసుకువచ్చి రైతుల్లో ఆనందాన్ని నింపారని, 'ప్రతి చేనుకు నీరు-ప్రతి చేతికి పని' సంకల్పంతో అభివృద్ధికి బాటలు వేశార న్నారు. ఎక్కడా లేనివిధంగా ఉపాధి నిధులు రూ.50 కోట్లు తీసుకు వచ్చిన ఘనత ఆమెదేనన్నారు. ఎమ్మెల్యే శిరీషపై ఫేక్ ఐడీలు పెట్టి సోషల్‌మీడియాలో పోస్టింగులు పెడుతున్నారని, దీనిపై తాము డీఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూ రావు, నేతలు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్ డొక్కరి శంకర్, దడియాల నర్సింహులు, తమ్మినేని గంగారామ్, కుత్తుమ లక్ష్మణ్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

● సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కాశీబుగ్గ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పట్టించు కోవడం లేదని, దీనిపై కూటమిగా ఉన్న టీడీపీ, జనసేనలు కనీస స్థాయిలో కూడా స్పందించడం లేదని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కనీస నిధులు కూడా కేటాయించడం లేదని, గత పదేళ్లలో రాష్ట్రానికి ఎలా నిర్వీర్యం చేశారో.. నేడూ అదే పరిస్థితి కొనసాగిస్తున్నారన్నారు. బీజేపీతో కూటమి భాగస్వామ్యంగా ఉన్నా నిధులు మాత్రం విడుదల చేయడం లేదని, దీనివల్ల నిరుద్యోగులు వలస బాట పడుతున్నారన్నారు. టారిఫ్ పెంచకుండా విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధపడుతున్నారని, దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. దీనిపై ఈనెల 30న వామపక్ష పార్టీల సమావేశంలో ఉమ్మడి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెండి తులసీదాస్ మాట్లాడుతూ నవంబరు 9,10 తేదీల్లో పలాసలో 18వ జిల్లా మహాసభ లు నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలని కోరా రు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బి.గోవిందరావు, నేతలు కె.మోహన్‌రావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

నరసన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపేటకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. వైశ్యరాజు జయరాజ్, సాంబమూర్తిరాజు, కిల్లంశెట్టి వెంకట రమణమూర్తిలకు ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కింజరాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పనిచేసిన వారికి గౌరవం

జలుమూరు, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) టీడీపీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పనిచేసిన వారికి పార్టీలో గౌరవంతో పాటు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కరవంజలో చేపడుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, మాజీ సర్పంచ్ జుత్తు అప్పలనాయుడు, నాయకులు సంపతిరావు శ్రీరాములు, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావుతదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు సరిచేసేందుకే సదస్సులు

జలుమూరు, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గుండువలసలో సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రామారావు, ఆర్ఐ కిరణ్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, టీడీపీ నేతలు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, గురుబెల్లి ఝాన్సీ, గుండ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటను రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం రైస్‌మిల్లర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఏవో పి.లతాశ్రీ, పీఏసీఎస్ సీఈవో ఐ.సింహాచలం, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ

పాతపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ పరీక్షల్లో రొంపివలస జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం ఎన్.కుమారస్వామి తెలిపారు. జిల్లాస్థాయిలో 75 బృందాలు పాల్గొనగా పాఠశాల బృంద సభ్యులు డి.మనోహర్ పి.ధనుష్ ఆర్.అభినయ్ ద్వితీయస్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని శ్రీ ముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆశ్వీయుజ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ తిరువీధి చేపట్టారు. ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

హిరమండలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సుభలయ ఆర్ఆర్ కాలనీలో 38 ముస్లిం కుటుంబాలున్నాయని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని జడ్పీటీసీ బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం జడ్పీలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. సుభలయ ఆర్ఆర్‌కాలనీ ఎంపీయూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజాను కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే గిరిజనుల అభివృద్ధి


పాలభిషేకం చేస్తున్న కూటమి నేతలు

మెళియాపుట్టి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గిరిజనుల అభివృద్ధి జరుగు తోందని కూటమి నేతలు అన్నారు. ఈ మేరకు పరశురాంపురం పంచాయతీలో సోమ వారం పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూ టీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభి షేకం చేశారు. దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ ఇవ్వడంతో పాటు ఉచిక ఇసుక విధానం వల్ల పేదలను ఆదుకుంటు న్నారన్నారు. ఈ పథకాలతో పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు శరత్, రాఘవరావు (బీజేపీ), రామ్మూర్తి, కిరణ్ (జనసేన), పి.రాజు, మోహనరావు దుర్యోధన (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఏకాక్షరి

టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని గేదెల ఏకాక్షరి ఎంపికైనట్లు హెచ్ఎం నౌపడా శోభారాణి సోమవారం తెలిపారు. ఈమె కర్నూలులో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 3000, 4000 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకాలు సాధించి నవంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమెను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ

పోలాకి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గొల్లలవలస ఉన్నత పాఠశాల విద్యారులు ప్రతిభ కనబరి చారని హెచ్ఎం వైవీ రమణమ్మ, పీడీ డి.భవానీ తెలిపారు. సోమవారం విజేతలకు పాఠశాలలో అభినందిం చారు. పి.వెంకటేష్, యూ.నవీన్ సిల్వర్‌మెడల్ సాధించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ఏకాక్షరిని అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

ఇంటర్వ్యూ

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు

● ఎస్.హైమావతి, తహసీల్దార్



మందస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.హైమవతి తెలిపారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని సాగునీటి సంఘాలున్నాయి. ఏ కేటగిరికి చెందినది?

జవాబు: 11 మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన సంఘాలున్నాయి.

ప్ర: రైతు ఓటర్ల వివరాలు వెల్లడి చేశారా?

జ: రైతుల నుంచి చేర్పులు, మార్పులు స్వీకరించడం జరిగింది.

ప్ర: జాబితా ఎప్పుడు విడుదల చేస్తారు? 11 నీటి సంఘాలకు ఎంత మేర ఆయకట్టు ఉంది?

జ: నవంబరు 11న జాబితా విడుదల చేయడం జరుగుతుంది. 11,291 ఎకరాల ఆయకట్టు ఉంది. రైతుల వివరాలు పొందుపరుస్తాం.

న్యూస్ బాక్స్

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

కొత్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లయిన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు కోరారు. సోమవారం మెట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. స్వర్ణోత్సవాల నేపథ్యంలో ఉపాధ్యాయులకు వివిధ స్థాయిల్లో పలు అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. మండలశాఖ అధ్యక్షుడు శోభన్ బాబు, జిల్లా కార్యదర్శి జి.మాధవరావు పాల్గొన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు

టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి రోడ్లపై తిరుగుతున్న ఆవులను గోశాలలో ఉంచడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి కేవీవీ జగన్నాథరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరు లతో మాటాడుతూ.. మూడు రోజుల్లో ఆవుల యజమానులు వచ్చి తీసుకువెళ్లకపోతే మందస గోశాలకు తరలిస్తామన్నారు. గోశాలకు తరలించిన ఆవులను ఇళ్లకు తీసుకువెళ్లాలనుకునే యజమానులు తమ ఆధార్‌కార్డుతో పాటు రూ.1000 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస, అక్టోబరు 28: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘ నాయ కులు కోరారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొత్తగా పారిశుధ్య కార్మికుల పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, డి.శ్రీనివాస్, వెంకట్, కూర్మా రావు, మురుగన్, రవి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

నరసన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుమందుల దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే లైసెన్సు రద్దు చేస్తామని నరసన్నపేట ఏడీఏ రవీంద్రభారతి హెచ్చరించారు. సోమవారం సివిల్ సప్లయ్స్ వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో సునీత, సీఎస్‌డీటీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రసీదు ఇవ్వాలి

పోలాకి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల ఎరువులు కొనుగోలు చేసిన వెంటనే రసీదు ఇవ్వాలని ఏడీఏ రవీంద్రభారతి ఆదేశించారు. సోమవారం ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఏవో చిరంజీవి పాల్గొన్నారు.